# స్వయంవరం

- ఎమ్మెస్వీ గంగరాజు

'కాంత లేని కొంప కాంతార వాసం!'- నార్ల వారి మాట నిజం అని నిరూపిస్తూ మా ఆవిడ లేని ఇల్లు అడవిలా తయారైంది తను పుట్టింటికెళ్లి పది రోజులయ్యేసరికి. ఇక వంటగది సరేసరి! తను వున్నప్పుడు డిసిప్లిన్‌డ్ సోల్జర్లలా ఎక్కడ గిన్నెలక్కడ, ఎక్కడ డబ్బాలక్కడ కుదురుగా వుండేవి. నేను పది రోజులై చేతులు కాల్చుకుంటూ వంట చేసుకోవడం కాదు గానీ వస్తువులన్నీ స్థానభ్రంశం చెంది చెల్లాచెదురై ఏ గిన్నె ఎక్కడో, ఏ డబ్బా ఎక్కడుందో వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. పనిమనిషిదేం పోయింది? గిన్నెలు తోమి ఒక దగ్గర కుప్ప చేసేసి చేతులు దులిపేసుకుని వెళ్లిపోతుంది. వాటిని దేని స్థానంలో దానిని సర్దిపెట్టే ఓపికా, తీరికా నాకెక్కడిదీ?

'ఇంక తను వచ్చేస్తే బాగుణ్ణు'- ఓ రాత్రి విసుక్కుంటూ అనుకుంటూండగా ఫోను రింగైంది. అటువైపు గొంతు మా ఆవిడదే. హమ్మయ్య! 'ఫలానా ట్రెయిన్‌కి వచ్చేస్తున్నా'నంటుంది కాబోలు అనుకున్నా ఆవిడ గొంతు వినగానే.

'ఏంవండీ, మీరొకసారి అర్జంటుగా బయలుదేరి రావాలిక్కడికి...' మాటల మధ్యలో లైను కట్ అయింది.

'హలో... హలో...' నేనెంత గొంతు చించుకున్నా అటు నుండి జవాబు లేదు.

మళ్లా తనే చేస్తుందేమో అని కొంతసేపు చూశాను. మరి ఫోన్ రాలేదు. నాలో ఆతృత ఎక్కువైంది. మర్నాడు ఉదయం లేవగానే టెలిఫోన్ బూత్‌కెళ్లి ట్రై చేశాను. లైను దొరకలేదు. మా అత్తవారిది చిన్న పల్లెటూరు. నెలకి ఒకసారో రెండుసార్లో తప్ప ఆ ఊళ్లో ఫోన్లు పని చెయ్యవు.

వాళ్ల మామ్మగారికి సుస్తీగా ఉందన్న వార్త విని పదిరోజుల క్రితం తను వెళ్లింది. పాపం బాగా సీరియస్‌గా ఉందేమో! ఆవిడ ఆ ఇంటికి పెద్ద దిక్కులా ఉంటారు, మా మామయ్యగారూ, అత్తగారూ వున్నా సరే! బయలుదేరక తప్పదు!! 'ఆ ఊరు వెళ్లాలంటే ఒక ట్రెయినూ, ఒక బస్సూ, ఒక రిక్షా- చచ్చినట్టు ఎక్కి తీరవలసిందే!'

'మీ ఊరు రావాలంటే కాశీ వెళ్లి వచ్చినంత శ్రమపడాలి!' అని వెక్కిరించేవాణ్ణి పెళ్లయిన కొత్త రోజుల్లో మా ఆవిణ్ణి. 'మీ పక్కింటి ఎత్తుపళ్ల పంకజాన్ని చేసుకోలేకపోయారా? ఈ శ్రమ తప్పేది' అంటూ తనూ చురక అంటించేది.

ఆ రోజు ఆఫీసులో సెలవు దరఖాస్తు పడేసి రాత్రి ట్రెయిన్‌కి బయలుదేరాలని నిశ్చయించుకున్నాను. ఉదయం ఆముదాలవలసలో దిగి బస్ ఎక్కితే ఏ పదకొండుకో చేరుతుంది రావివలస రోడ్డు. అక్కడ రిక్షా ఎక్కి గతుకుల రోడ్డమ్మట అరగంట ప్రయాణం చెయ్యాలి రావివలస చేరాలంటే. ఆటోలో వెళ్తే పది నిముషాల్లో చేరవచ్చు. కానీ ఆ ఊరికి ఆటోలు నిషిద్ధం. ఆ ఊరు దాటి వెళ్లే ఊళ్లకి మాత్రమే ఆటోలు! ఆ ఊరికి మాత్రం రిక్షాలే దిక్కు. రిక్షావాళ్లు ఆటోవాళ్లతో పోట్లాడి కుదుర్చుకున్న ఒప్పందం అది!

కాఫీ తాగి వంట మొదలుపెడదామనుకుంటూ ఉండగా కాలింగ్ బెల్ మ్రోగితే వెళ్లి తలుపు తెరిచాను. ఎదురుగా మరదలు స్వర్ణా, గేటు బయట రిక్షాలోంచి సామానులు దింపుతూ మరో ఆగంతకుడూ! క్షణకాలం స్వర్ణనీ, ఆ అపరిచిత వ్యక్తినీ చూస్తూ ఉండిపోయాను.

'రా... స్వర్ణా!' అన్నాను వెంటనే తేరుకుని.

నా వెనక స్వర్ణా, ఆమె వెనక లగేజీ తీసుకుని ఆ కొత్త వ్యక్తీ లోనికొచ్చారు.

ఆ కొత్త వ్యక్తి ఎవరో ముఖం మీద అడిగితే బాగుండదని వాళ్లిద్దర్నీ హాల్లో కూర్చోబెట్టి రెండు గ్లాసుల్లో మంచినీళ్లు తెచ్చి ఇచ్చాను.

'అక్క ఇంట్లో లేదా బావగారూ?' అంది స్వర్ణ గ్లాసందుకుని నుదుటికి పట్టిన చెమటని చీర

చెంగుతో ఒత్తుకుంటూ.

'లేదమ్మా. వాళ్ల నానమ్మకి వంట్లో బాగోలేదని తెలిసి వెళ్లింది' అన్నాను.

నా మాటలకి ఆమె కాస్త ఆందోళన చెందినట్టనిపించింది. కాఫీ పెట్టి తెస్తానని చెప్పి వంటింట్లోకి నడిచాను వాళ్లిద్దర్నీ గదిలోనే కూర్చోబెట్టి.

స్వర్ణ మా ఆవిడ పిన్ని కూతురు. అంటే, మా అత్తగారూ, స్వర్ణ అమ్మగారూ అక్కాచెల్లెళ్లు.

మా పెళ్లయ్యేసరికి బడికి వెళ్లే వయసు ఆమెది. వాళ్ల నాన్నగారు టాటా ఫ్యాక్టరీలో పనిచేస్తూ అక్కడే వుంటారు. మా పెళ్లయిన రెండు సంవత్సరాలకు ఆమెని అక్కడ బడి మానిపించి మా దగ్గరే వుంచి మెట్రిక్ చదివించారు. నేనే ట్యూషన్ చెప్పేవాణ్ణి. తర్వాత అక్కడే కాలేజీలో చేరి డిగ్రీ అయ్యాక ఏదో బ్యాంక్‌లో ఉద్యోగం సంపాదించుకుంది స్వర్ణ. ఆ పిల్లకి నేనన్నా, మా ఆవిడన్నా విపరీతమైన అభిమానం. తరచూ ఫోన్ చేస్తూ వుంటుంది. వారిద్దరి గూర్చి ఆలోచిస్తూనే కాఫీ కలపడం పూర్తిచేసి, మూడు కప్పుల్లో పోసి వాళ్లకెదురుగా రెండు కప్పులుంచి నేనో కప్పు తీసుకున్నాను.

. . . . .

తర్వాత స్వర్ణ చెప్పిన మాటలు విని నిలువునా నీరైపోయాను. అతడు తను పనిచేస్తున్న బ్యాంక్‌లోనే పనిచేస్తున్నాడట. వేరే కులం వాడట. ఆమె తల్లిదండ్రుల కిష్టం లేకపోవడం వలన అక్కడే ఏదో దేవాలయంలో వాళ్లకి చెప్పకుండా పెళ్లి చేసేసుకుని మా మద్దతు కోసం సరాసరి ఇక్కడకు వచ్చేశారట! వీళ్లు బయలుదేరేసరికి స్వర్ణా వాళ్ల

## గతం

గతించిన కాలం
మిగిల్చిన జ్ఞాపకాలు
అలలు అలిసినా
చెరగని శిలాక్షరాలు

- బి.వి.రమణ.

నాన్నగారు క్యాంప్‌లో వున్నారట. గాభరా పడవద్దని ఎవరిచేతో ఇంటికి ఉత్తరం పంపించి, పది రోజులు సెలవుపెట్టి ఇద్దరూ ఇలా వచ్చేశారు. వారి సాహసానికి ఆశ్చర్యం కలిగింది నాకు. ఈ రోజుల్లో ఉద్యోగం సద్యోగం లేకుండా కాలేజీల్లో చదువుకునే పిల్లలే లేచిపోతున్నారు ధీమాగా. మంచి ఉద్యోగాలు చేసుకుంటున్న వీళ్లిద్దరూ తెగించడం ఆశ్చర్యపడవలసిన విషయమేమీ కాదు. అయితే, స్వర్ణ మనస్తత్వానికి ఈ తెగింపు పూర్తిగా విరుద్ధం. ఎంతో అమాయకంగా ఉండేది. అలాంటి స్వర్ణ ఇలా నిర్ణయం తీసుకోవడం కాస్త ఆశ్చర్యం కలిగించే విషయమే మరి!

నాకు కంగారు కలిగించిన విషయమేమిటంటే, మా ఆవిడ వచ్చేవరకూ వాళ్లిద్దరూ మా ఇంట్లోనే ఉండడానికి నిశ్చయించుకోవడం. నాకేం చెయ్యాలో తోచలేదు. ఆ రాత్రికే నా ప్రయాణమాయె! టాటా ఫోన్ చేద్దామనుకుంటే వద్దని స్వర్ణ బతిమాలింది. 'అక్క వచ్చేవరకూ ఇక్కడే వుంటాం. అక్క వచ్చాక, అక్కా మీరూ వచ్చి అమ్మకీ, నాన్నకీ నచ్చజెప్పా'లంటూ ఆ పిల్ల కంటనీరు పెట్టుకుంది. నిన్నకాక మొన్న పెళ్లి చేసుకున్న పిల్ల అలా కంటనీరు పెట్టుకోవడం కష్టమనిపించింది నాకు.

'స్వర్ణా! నీకీ ఇల్లు కొత్త కాదు. నేను వెళ్లి రెండు రోజుల్లో అక్కని తీసుకొచ్చేస్తాను. అక్క వచ్చాక మిగతా విషయాలు మాట్లాడుకుందాం. మీరేమీ దిగులుపడకండి. నేనూ, అక్కా వచ్చి మీ వాళ్లకి నచ్చజెప్తాం' అని ఆమెని ఊరడించక తప్పలేదు నాకు.

కళ్లు తుడుచుకుని మౌనంగా ఉండిపోయింది స్వర్ణ. నాకు తెలుసు!ఆ క్షణంలో ఏదో సాహసం చేసేసి పెళ్లి చేసుకుంది. కానీ ఇప్పుడు ఎంతో బెంబేలు పడిపోతోంది.

'ఇంకా ఈ రోజుల్లో కులాలూ, జాతుల పట్టింపులేమిటి? లక్షణంగా వున్న వ్యక్తిని నీ జీవిత భాగస్వామిగా చేసుకున్నావ్. ఇద్దరూ హాయిగా సంసారం చేసుకోవచ్చు. అమ్మా నాన్నా పాతకాలం వాళ్లు కాబట్టి మొదట్లో కాస్త కోపగించుకోవడం

సహజమే! కొన్నాళ్ల తర్వాత వాళ్లే సర్దుకుంటారు' మళ్లీ నేనే అన్నాను ఆమెకు కాస్త ధైర్యం కలిగించాలని.

ఆ పూట వంట పాపం స్వర్ణే చేసింది. కొత్త దంపతుల కోసం బెడ్‌రూం సర్ది, వాళ్లకి బ్లెస్సింగ్స్ చెప్పి ఆ సాయంత్రం ట్రెయిన్‌కి బయలుదేరాను, వాళ్లకు ఇల్లు అప్పగించి.

నేను బెడ్‌రూం సర్దడం చూసి పాపం అతడు సిగ్గుపడిపోయాడు.

'ఏమిటిదంతా, బావగారూ?' అని స్వర్ణ చిరుకోపం ప్రదర్శించింది.

. . . . .

మర్నాడు ఉదయం పది గంటలు దాటుతుండగా అత్తవారిల్లు చేరుకున్నాను. ఇంటి లోపల ఎటువంటి వాతావరణం ఎదురు కాబోతోందోనని దిగులుగానే వుంది.

గుమ్మంలోనే ఎదురైంది శ్రీమతి. తన ముఖంలో ఏమాత్రం విచారం కానీ, ఆందోళన ఛాయలు కానీ లేకపోవడం చూశాక కాస్త ఊరట కలిగింది. ఇంతలో మామ్మగారూ, మా అత్తగారూ కూడా 'ఏం బాబూ, బాగున్నావా?' అంటూ ఎదురొచ్చారు.

'హమ్మయ్య! అందరూ కులాసాగా వున్నారు' అనుకున్నాను మనసులో.

'మామయ్యగారు లేరా?' అన్నాను జోళ్లు విప్పుకుంటూ ఆయన కనబడకపోవడం గమనించి.

'టౌనుకి వెళ్లారు. ఇక వచ్చేస్తారు' అంది శ్రీమతి.

ఎవరూ అనారోగ్యంగా లేరు. మరి నన్నెందుకు అర్జంటుగా రమ్మని ఫోన్ చేసిందో ఎంత ఆలోచించినా బుర్రకి తట్టడం లేదు. స్నానం చెయ్యడానికి బయలుదేరుతూ, 'ఎందుకు అర్జంటుగా రమ్మన్నావ్?' అని అడిగాను మా ఆవిణ్ణి.

'స్నానం చేసి రండి. భోజనాలయ్యాక తీరిగ్గా ఆ విషయం మాట్లాడుకుందాం' అంది.

ఆ విషయం ఏమిటో సస్పెన్స్ భరించడం కష్టంగా వుంది నాకు. ఆ సమస్య ఏదో తీరాక ఇంక స్వర్ణ గూర్చి చెప్పాలి! సమస్యలన్నీ ఒక్కసారే కట్టకట్టుకుని వస్తాయి.

భోజనాలయ్యాక మొదలుపెట్టింది మా ఆవిడ - 'ఈ స్వర్ణ చూశారా ఎలా పేచీ పెడుతోందో?'

నేను చెప్పాల్సిన విషయం తను చెప్తుండడం ఆశ్చర్యం కలిగించింది. నాతోపాటు మా అత్తగారూ, మామ్మగారూ శ్రోతలుగా మారారు.

'... తనతో పనిచేస్తున్న వేరే కులంవాణ్ణి పెళ్లి చేసుకుంటానంటోందిట! రాజ్యాలు బాబాయి నిన్న టాటా నుండి వచ్చారు. వాళ్లు ఎంత చెప్పినా వినడం లేదట. పాపం, బాబాయి గాభరా పడిపోయి అమ్మనీ, నాన్నగార్నీ తీసుకెళ్లడానికి వచ్చారు. ఆ పిల్లకి మీరంటే కాస్త భయం, భక్తీ వున్నాయి గనుక మీరూ, నేనూ కూడా వెళ్లి మందలిస్తే మన మాట వింటుందేమోనని మీకు ఫోన్ చేశాను. ఇది వేరే కులం వాణ్ణి చేసుకుని చక్కా వెళ్లిపోతే రేపు ఆ రెండో గుంటని చేసుకోవడానికెవరు వస్తారు చెప్పండి? ఇంటికి పెద్దకూతురు. పొట్టనిండా చదువుకుని, నలుగురిలో మెసలుతోంది. ఆ మాత్రం మంచిచెడ్డలు ఆలోచించవద్దూ? మనందరికీ రేపు బొకారో ఎక్స్‌ప్రెస్‌కి టిక్కెట్లు రిజర్వ్ చేయడానికి వెళ్లారు బాబాయీ, నాన్నగారూ. మీరు కాస్త గట్టిగా మందలించి దాని ప్రయత్నం విరమించుకునేలా చెయ్యాలి. పాపం! బాబాయి మీ మీదే భారం వేసుకున్నారు. ఈ విషయం చెప్పి రెండు జతల బట్టలు అదనంగా తెచ్చుకోమని చెప్పాలనుకున్నాను. లైను కట్ అయింది'- మా ఆవిడ వాక్ప్రవాహం ఆగింది.

ఆవిడ మాటలు విన్నాక నా గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టనిపించింది! వారిద్దరి పునస్సంధానం మా ఇంట్లో ఏర్పాటుచేసి మరీ వచ్చాను, వారి వివాహానికి ఆమోదముద్ర వేయడమే కాకుండా.

❑